

శిఖరాగ్రానికి చేరుకున్న వ్యక్తి.. పాతాళం నుంచి చూసేవారికి సూదిమొనంతే కనిపిస్తాడు. ఈ బక్కపల్చని మనిషి అందనంత ఎత్తుకు వెళ్లాడని హర్షించకపోగా.. అందకుండా పోయాడని విమర్శిస్తూ తమ కుసంస్కారాన్ని వెళ్లగక్కుతారు కొందరు. కానీ, అందలం చేరుకునే క్రమంలో ఆ వ్యక్తి ఓ శక్తిగా పరిణామం చెందాడు. ఆ శక్తిని సంతరించుకున్న వ్యక్తి ఆసక్తంతా తను ఎక్కడి నుంచి వచ్చానన్న దానిపైనే ఉంటుంది. తన వ్యక్తిత్వ, అస్తిత్వ నిర్మాణ క్రమంలో వేసుకున్న పునాదులు ఏమిటో ఆయనకు ఎప్పుడూ గుర్తుంటాయి. వాటిపై పదిలంగా కూర్చిన రాళ్ల నమూనాలూ గుర్తుంటాయి. వాటిని పేర్చే క్రమంలో నలిగిన వేళ్ల గుర్తులు ఇప్పటికీ స్పష్టంగా కనిపిస్తాయి. కట్టిన గోడ కట్టినట్టే కూలిపోయిన దాఖలాలూ ఉన్నాయి. రాతి మధ్యలోంచి మొలుచుకొచ్చిన కలుపు మొక్కలు రాత్రికి రాత్రి తిన్నింటి గోడలకు బీటలు తెచ్చిన సందర్భాలు ఉన్నాయి. అయినా ఆయన దేనికీ వెరవలేదు. ఎప్పుడూ బెదరలేదు. ఎన్నోసార్లు ఆయన్ను పలకరించబోయిన కుంగుబాటు... ఈ మనిషిని లొంగదీసుకోవడం చేతకాక కృశించి నశించింది. ఉద్యమ పథంలో... తన కల సాకారానికి ఎన్నుకున్న ఎన్నికల ఎత్తులకు.. ఇప్పుడు ఆయన అతీతుడు. గెలుపును మెచ్చుకోలుగా చూడటం, ఓటమికి నొచ్చుకొని పోవడం ఇవన్నీ ఎప్పుడో దాటేశారు. దటీజ్ కేసీఆర్!

***

దేశ రాజకీయ చరిత్రలో కేసీఆర్‌కు ఎదురైనన్ని పరీక్షలు మరెవరికీ తారసపడకపోవచ్చు. ఆయన భాష మీద దాడి చేశారు. వ్యక్తిత్వాన్ని హననం చేసే ప్రయత్నం చేశారు. నిబద్ధతను ప్రశ్నించారు. నడవడిని ఎగతాళి చేశారు. ఆయన ఒంటిచేత్తో సాధించిన విజయాలను పథకం ప్రకారం ఇతరులకు ఆపాదించారు. వెనక్కి తగ్గినప్పుడు మాత్రం కేసీఆర్ పని అయిపోయిందంటూ వక్ర భాష్యాలు చెప్పారు. దుర్దశలో ఉన్నాడంటూ బలహీనపర్చాలని ఉద్దేశపూర్వకంగా కుయుక్తులు పన్నిన 'గేలి'కేయులందరూ కాలగతిలో గాలికి కొట్టుకుపోయారు. ఎవరెన్ని మాటలన్నా.. తొణకని, బెణకని మనస్తత్వం కేసీఆర్ సొంతం. ఎదురుదెబ్బ తిన్నప్పుడు పగవాడు సైతం అబ్బురపడేలా నిబ్బరం ప్రదర్శించేవారు. ఎదురులేనంతగా ఎదిగినప్పుడు కూడా ఒదిగి ఉండేవారు. అంతెందుకు ఆయన రాజకీయ ప్రస్థానమే ఎదురుదెబ్బతో మొదలైంది. తనను రాజకీయంగా తీర్చిదిద్దిన సిద్దిపేట గడ్డమీదే మొదటిసారి ఓటమి రుచి చూశారు. 1983లో అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. ప్రజలకు దగ్గరవ్వడమే పరిష్కారంగా భావించారు. ఊరూరూ తిరిగారు. ప్రతి దళిత గూడునూ పలకరించారు. వీధి వీధినీ గుర్తుంచుకునేలా పట్టుసాధించారు. ఫలితం 1985 ఎన్నికల్లో విజయం. ఆయన్ను అంటిపెట్టుకుందామని అనుకున్న ఓటమి.. రెండేండ్లకే తట్టాబుట్టా సర్దుకొని సెలవు పుచ్చుకుంది. ఇప్పటికీ ఆయన దరిదాపుల్లోకి రావాలంటేనే జంకుతున్నది.

***

రాజకీయ వ్యూహాలు రచించడంలో కేసీఆర్‌ది విభిన్నమైన శైలి. దారులన్నీ మూసుకుపోయినా బిగించిన పిడికిలి సడలించిన దాఖలాల్లేవు. తను నెగ్గడానికి ఎన్నడూ తగ్గని మనిషి.. తెలంగాణ కోసం ఎన్నోసార్లు ఒగ్గారు. 'నీ సత్య సంధత నిరూపించుకోవాల'ని అనామకుడు కోరినా అందుకు సిద్ధపడ్డారు. ఆ పట్టుదలే కేసీఆర్ ఒక్కడే తెలంగాణ తేగల సమర్థుడని జయశంకర్ సార్ విశ్వసించేలా చేసింది. తెలంగాణ ఆకాంక్షను వమ్ము చేయడన్న నమ్మకమే కష్టనష్టాల్లో ఆ పెద్దాయన... కేసీఆర్‌కు అండగా నిలిచేలా చేసింది. బీఆర్ఎస్ ఆవిర్భావానికి ముందు ప్రత్యేక రాష్ట్ర కోరిక దాదాపు అంతర్థానమైంది. జయశంకర్ సార్ లాంటి కొందరు మేధావులు 'ఎవరైనా రాకపోతారా..' అని ఎదురుచూస్తున్న సందర్భం. దేవదత్త శంఖారావంతో 'వచ్చిన వాడు ఫల్గుణుడు..' అన్నట్టుగా కేసీఆర్ రంగప్రవేశం ఓ కీలక మలుపు. అగ్గిబరాటా ఉద్యమబావుటా అయిందన్న విశ్వాసం వారిలో చిగురించిన క్షణమది.

***

తెలంగాణ జెండాతో కేసీఆర్ రాజకీయ ప్రస్థానంలో పోరాట శకం మొదలైంది. అప్పటివరకు ఉద్యమం అంటే హింస ఉండాలి, కాల్చేయాలి, కూల్చేయాలి అనే భావన ఒకటుండేది. తెలుగు సినిమా హీరోలు విలన్ల మీద విరుచుకుపడ్డట్టు ఉంటుందని భావించారు. అది సరైన పంథా కాదనుకున్నారు కేసీఆర్. పిడికిలి బిగించాలి కాని, ఎత్తిన పిడికిలిని దాడికి ఉపయోగించొద్దు అనుకున్నారు. పార్లమెంటరీ విధానంతోనే ప్రత్యేక రాష్ట్రం సాధించొచ్చని నిశ్చయించుకున్నారు. దారి తప్పితే తెలంగాణ ప్రజల దశాబ్దాల ప్రజల ఆకాంక్ష 1969 పోరాటంలా రక్తసిక్తమవుతుందని గ్రహించారు. అందుకే, రాజ్యాంగం కల్పించిన హక్కుతోనే,

## నవరస భరితం.. ప్రసంగం!

కేసీఆర్ ప్రసంగం ఓ సజీవ జలధార. ఆయన మాటల్లో నవరసాలు ఒలుకుతాయి. సందర్భోచితంగా, రసస్ఫోరకంగా మాట్లాడగలరు. ఆయన ఉపన్యాసంలో రౌద్రం ఉంటుంది. వీరత్వం ఉంటుంది. ఆర్తి వినిపిస్తుంది. కరుణ కనిపిస్తుంది. హాస్యం తొణికిసలాడుతుంది. వ్యంగ్యం తొంగిచూస్తుంది. శబ్ద నిఘంటువు పొంగిపోయేలా పదప్రయోగాలు చేస్తుంటారు. ప్రసంగించే వేదికకు తగ్గట్టుగా ఆయన మాటలు పల్లవిస్తుంటాయి. సాహితీ సభలో పద్యాలు వినిపిస్తూ పసందైన ప్రసంగం చేస్తారు. చలోక్తులు విసురుతూ సభను రంజింపజేస్తారు. వేదిక ఏదైనా సభికులను కట్టిపడేయడం ఆయన తనకు తానుగా నేర్చుకున్న విద్య. సాహితీవేత్తల సాంగత్యం, పుస్తక పఠనం, విషయ అవగాహన, భాషా పరిజ్ఞానం ఇవన్నీ కేసీఆర్‌ను అత్యుత్తమ వక్తగా తీర్చిదిద్దాయి. సంక్లిష్టమైన విషయాన్ని కూడా అత్యంత సరళంగా చెప్పడం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య. ఉద్యమ సమయంలో కేసీఆర్ మాట్లాడుతుంటే జనం ఊగిపోతూ విన్నారు. ఒగ్గుకథ వింటున్నట్టుగా విన్నారు. జలసాధన క్యాసెట్‌లో ఉన్న కేసీఆర్ మాటలను ఊరూరా చౌరాస్తాల్లో బుంగీలు పెట్టుకొని మరీ విన్నారు. అంతగా ప్రభావితం చేశాడు. విషయంతోపాటు సభను కూడా ఓన్ చేసుకుని ఆయన మాట్లాడే శైలికి అందరూ అభిమానులే! కానీ, ఆంధ్రా మీడియా మాత్రం కేసీఆర్‌ను బద్నాం చేయడమే పనిగా పెట్టుకుంది. భాష మీద, సాహిత్యం మీద, ఆయా విషయాల మీద ఆయనకున్న సాధికారతను కావాలనే విస్మరించింది. కేసీఆర్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా పనిగట్టుకొని ఆయనను మాటల మాంత్రికుడనీ, మాయల మరాఠీ అనీ అవగాహనా రాహిత్యంతో నోటికొచ్చినట్టు విశ్లేషించారు ఆ మీడియా పెద్దలు. కేసీఆర్ వ్యక్తిగత అలవాట్లను భూతద్దం పెట్టి చూపించారు. వ్యవసాయ క్షేత్రానికి వెళ్లడాన్ని కూడా వేలెత్తి చూపారు. ఆయన నోటి వెంట రత్నాలు రాలాయి, రాళ్లూ రాలాయి. విజ్ఞులు రత్నాలు ఏరుకున్నారు. కొందరు అజ్ఞానులు రాళ్లు ఏరుకొని విశృంఖలంగా మాట్లాడుతూ, దీనికి ఆద్యుడు కేసీఆరే అంటూ సూత్రీకరించారు. కానీ, కేసీఆర్ మాటల్లో ఉండే ఆర్ద్రత, సృజన వాళ్లు ఎప్పటికీ గుర్తించలేరు.